క్లుప్తంగా

తప్పిన ప్రమాదం

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని లచ్చయ్యపేట కాలనీలో ఓ ఇంట్లో గ్యాస్ లీకై న ఘటనలో ప్రమాదం తప్పింది. గురువారం తెల్లవారుజామున కాలనీకి చెందిన వారణాశి సాయి ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించిన సాయి, పైడిరాజులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైర్‌స్టేషన్ ఎస్ఐ టి.ఎస్.ఎస్. జనార్దనరావు సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని, మంటలు ఆర్పివేశారు. పెద్ద ప్రమాదమేమీ జరగకపోవడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

24న జాబ్‌మేళా

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఎల్‌అండ్‌టీ కంపెనీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ఇంటర్వ్యూలకు ఎలక్ట్రీషియన్, వెల్డర్, డీఎం సివిల్, ఫిట్టర్ ట్రేడులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు రేపు

రాజాం సిటీ: స్థానిక జ్ఞానజ్యోతి విద్యాలయంలో ఈ నెల 24వ తేదీన న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యాహక్కు చట్టం, బాలకార్మిక వ్యవస్థ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు.

రూ.87 కోట్లతో వంతెన నిర్మాణం



నదిలో పిల్లరు నిర్మిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామం వద్ద నాగావళి నదిపై బలసలరేవు నుంచి శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస మండలం, ఇసుకలపేట గ్రామం వరకు చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. దాదాపు రూ. 87 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు జరుగుతున్నాయి. 560 మీటర్ల పొడవునా వంతెన నిర్మాణం చేస్తుండగా, ప్రస్తుతం నదిలో పిల్లర్లు నిర్మిస్తున్నారు. ఈ పనులను కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడుతో పాటు ఆర్‌అండ్‌బీ ఏఈ ఆంజనేయుల నాయక్ గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు.

పరామర్శ

బొబ్బిలి: మున్సిపల్ కౌన్సిల్ రెండో సభ్యుడు కోట పెదరాములును మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, కౌన్సిల్ సభ్యులు పరామర్శించారు. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో ఆయన గాయపడి, చికిత్స పొందుతుండగా, పాతబొబ్బిలిలోని ఆయన స్వగృహానికి గురువారం వెళ్లి, ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఐ.గోవిందరావు, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జవహర్ నవోదయ'కు పలువురి ఎంపిక

రేగిడి: జవహర్ నవోదయ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో మండలంలోని వండానపేటకు చెందిన అమనాన లక్ష్మణ, రేగిడికి చెందిన ఎం.సోమేశ్వరరావు ఆరో తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులను సిబ్బంది, తల్లిదండ్రులు అభినందించారు.

సంతకవిటి: మండలంలోని కావలి గ్రామానికి చెందిన అన్నెపు సంతోష్‌కుమార్, మండాకురిటి గ్రామానికి చెందిన మింద్రాన జ్యోత్స్న ప్రియాంక నవోదయ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఎంపికయ్యారు.

వంగర: వెన్నెలవలస జవహర్ నవోదయ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశానికి మండలంలోని మగ్గూరుకు చెందిన మరడాన పవన్‌కుమార్ ఎంపికయ్యారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

రాజాం: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు, సచివాలయ భవన నిర్మాణాల పురోగతి, గ్రామాల్లో తాగునీటి సదుపాయాలపై సమీక్షించారు. గ్రామాల్లో తరచూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు.

అన్నదాతకు 'భరోసా'

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతకు అన్ని విధాలా భరోసా కల్పిస్తున్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని బలంగా నమ్మిన ఆయన వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందివ్వడంతో పాటు సకాలంలో రాయితీపై విత్తనాల పంపిణీ, సాగులో మెలకువలు, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. నాడు వ్యవసాయం దండగ అనే వారు కూడా నేడు సాగును ఓ సంబరంలా చేసుకునేలా ఆయన ప్రోత్సహిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- రైతుకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు
- సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల పంపిణీ
- సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేత
- సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

రాజాం సిటీ: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తున్నారు. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు క్షేత్రస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా వీటి ద్వారా నాణ్యమైన విత్తనాలను సబ్సిడీపై అందిస్తుండడమే కాకుండా సకాలంలో ఎరువులు, పురుగు మందుల పంపిణీ కూడా చేపడుతున్నారు. భూసార పరీక్షలు చేయించి, ఏ పంట సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చనే అంశాలపై సైతం అవగాహన కల్పిస్తున్నారు. ఆర్‌బీకే సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు పంటలను పరిశీలింపజేసి, తగిన సలహాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పండిన పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తూ రైతు కళ్లల్లో ఆనందకాంతులు వెల్లివిరిసేలా చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సేవలు ఇలా..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)ల్లో డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌ల ద్వారా రైతులకు సాంకేతిక సాయం అందిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి, ఆర్బీకేల్లో సబ్సిడీపై విత్తనాలు ఇవ్వడంతో పాటు భూసార పరీక్షల శాంపిల్స్ సేకరించి, వాటిని ల్యాబ్‌కు పంపించి వచ్చిన రిపోర్టు ఆధారంగా రైతులకు పంటల సాగుపై సూచనలు అందించనున్నారు. ఇలా చేయడం ద్వారా సాగు పెట్టుబడి తగ్గడంతో పాటు పంట ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. మండలంలో 18 కస్టమర్ హైయరింగ్ సెంటర్లు ఉండగా, వాటి పరిధిలో 14 ట్రాక్టర్లు అందించారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. ప్రతిఏటా ఖరీఫ్‌కు ముందుగానే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తున్నారు. ఉచిత పంటల బీమా నమోదు, పొలంబడి ద్వారా రైతులకు శిక్షణ కల్పిస్తున్నారు. పంటకోత ప్రయోగాలు, పంటల సాగుపై అవగాహన కల్పించేలా రైతు భరోసా మాసపత్రికను అందుబాటులోకి తీసుకువచ్చారు. పంట దిగుబడులు పెరిగేలా వినూత్న సాగు విధానాలను ఆర్‌బీకే ద్వారా ప్రచారం చేయిస్తున్నారు.

రాజాం మండలంలో ఆర్‌బీకేలు, వాటి సేవలు ఇలా..

మండలం	రాజాం
ఆర్‌బీకేలు	21
సిబ్బంది	17
మల్టీ ఫంక్షనల్ కియోస్క్‌లు	21
సీహెచ్‌సీ గ్రూపులు	18
వైఎస్సార్ యంత్రసేవ కింద అందించిన ట్రాక్టర్లు	14
మండలంలో పంపిణీ చేసిన కౌలురైతు కార్డులు	72
రైతు భరోసా పథకం లబ్ధి పొందిన కుటుంబాలు	10,222
లబ్ధి పొందిన మొత్తం	రూ.54.485 కోట్లు



పెనుబాకలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం



జీసీహెచ్‌పల్లి ఆర్‌బీకే నుంచి విత్తనాలు తీసుకువెళ్తున్న రైతులు

గతంలో ఏది కావాలన్నా పట్టణాలకే..

గతంలో(వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాకముందు) ఎరువులు, పురుగుమందులు కావాలంటే పట్టణ ప్రాంతాలకు రైతులు వెళ్లాల్సి వచ్చేది. ఫెర్టిలైజర్ దుకాణాల్లో వారు చెప్పిన రేటుకే కొనుగోలు చేయాల్సిన దుస్థితి. రవాణా చార్జీలతో కలిపి అది రైతులకు భారంగా ఉండేవి. అంతేకాకుండా నకిలీ విత్తనాలు, పురుగుమందులతో తీవ్రంగా నష్టపోయే వారు కూడా. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్దనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బీకేలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో అప్పులు చేయాల్సి వచ్చేది..



గతంలో వ్యవసాయానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడు రైతు భరోసా పథకం కింద సీఎం జగన్ వేస్తున్న డబ్బులు పెట్టుబడిసాయంగా ఉపయోగపడుతోంది. ప్రతీ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే మా బ్యాంకుఖాతాలో నగదు జమ చేస్తున్నారు. నాలుగేళ్లుగా లబ్ధి పొందాను.

–తాడ్డి త్రినాథ, రైతు, లక్ష్మీపురం, నందబలగ పంచాయతీ.

గ్రామాల్లోని ఆర్‌బీకేలతో సౌకర్యం..



గ్రామాల్లోనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలతో ఎంతో సౌకర్యంగా ఉంది. సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు లభిస్తున్నాయి. గతంలో విత్తనాలు కావాలంటే వేకువ జామునే మార్కెట్ కమిటీ వద్దకు వెళ్లి, క్యూలో నిల్చునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ బాధలన్నీ తప్పాయి.

–పెద్దింటి ముఖలింగం, రైతు, పొగిరి, రాజాం మండలం.

ఇబ్బందులు తొలగాయి..



గతంలో పంటలకు తెగులు సోకితే ఆ మొక్కను తీసుకుని, పట్టణంలోని ఎరువుల షాపు వాళ్లకు చూపించేవాళ్లం. వాళ్లు ఇచ్చిన మందులను పంటలకు వాడేవాళ్లం. అవి పనిచేయకుంటే పంట పోయేది. దీంతో ఎవరికి చెప్పుకోలేకపోయి నరకం అనుభవించేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఏ పంట అయినా ఆర్‌బీకే సిబ్బంది వచ్చి, పంటను పరిశీలించి అవసరమైన మందులు అందిస్తున్నారు. దీంతో గతంలో నెలకొన్న ఇబ్బందులు తప్పాయి.

–బండి రమణ, రైతు, పెనుబాక, రాజాం మండలం.

మండలానికో మదర్ పౌల్ట్రీ యూనిట్

- రాజాం వెలుగు శాఖ ఏరియా కో–ఆర్డినేటర్ చిరంజీవి



మాట్లాడుతున్న వెలుగు శాఖ ఏరియా కో–ఆర్డినేటర్ చిరంజీవి

వంగర: మహిళా స్వయం శక్తి సంఘాల్లోని మహిళలు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని రాజాం వెలుగు శాఖ ఏరియా కో–ఆర్డినేటర్(ఏసీ) అలుగోలు చిరంజీవి ఆకాంక్షించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీలు, వీఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రభుత్వం గ్రామైక్య సంఘాల ద్వారా మహిళలకు అందిస్తున్న వివిధ రకాల పథకాల ద్వారా సమకూరిన సొమ్ముతో అభివృద్ధి సాధించాలన్నారు. ప్రతీ మండలానికి ఒకటి చొప్పున నియోజకవర్గంలో నాలుగు మదర్ పౌల్ట్రీ యూనిట్లు ఏర్పాటు చేస్తామని, దీనికోసం మహిళా సంఘాల సభ్యులకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. అలాగే ప్రతీ గ్రామంలో పెరటి కోళ్ల పెంచేందుకు ఐదు సంఘాల చొప్పున గుర్తించాలని, రాజాం నియోజకవర్గంలో 600 సంఘాలకు పెరటి కోళ్లను అందించి, మహిళల ఆర్థిక ప్రగతికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన నిధులను మహిళల వ్యక్తిగత ఖాతాలకు బదిలీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాల కింద రుణ సౌకర్యం కల్పించేందుకు లబ్ధిదారులను గుర్తించాలన్నారు. సీసీలు, వీఓఏలు లక్ష్యాలను పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ డీపీఎం మూర్తి, ఏపీఎంలు ఎం.చక్రపాణి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మండల జేసీఎస్ కన్వీనర్ శంకరరావు

తెర్లాం: మండలంలోని లోచర్ల గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు గురువారం అవగాహన కల్పించారు. ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సేవలు, పథకాలు పారదర్శకంగా అందాలన్న సదుద్దేశ్యంతో ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎటువంటి యూజర్ చార్జీలు లేకుండా ఉచితంగా ప్రజలకు అవసరమైన 11 ధ్రువపత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంపై గురువారం అవగాహన కల్పించారు. మండల జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు, సేవలు అందజేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న గోరుముద్ద పథకం

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన విద్యార్థుల కోసం వండిన వంటకాలను రుచి చూసి పరిశీలించారు. రుచి, శుచితో పదార్థాలు ఉండాలని, మెనూ ప్రకారం వంటలు వండిపెట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హైమావతి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా తోటపల్లి కాలువ ఆధునీకరణ పనులు



పూడికలు తొలగించిన తర్వాత కాలువ ఇలా..

రాజాం: తోటపల్లి రాజాం బ్రాంచి కాలువ ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలో 16 కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ కాలువ ద్వారా 11 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ప్రస్తుతం 9 కిలోమీటర్ల పొడవునా పేరుకుపోయిన పూడికలు తొలగించి, ఆధునీకరిస్తున్నట్లు డీఈఈ కె.నవీన్ తెలిపారు. దాదాపు రూ.25 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేస్తున్నామన్నారు.

పుస్తకాల గది సీజ్

బొబ్బిలి: స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థులకు అధిక ధరకు పుస్తకాలు, యూనిఫాం విక్రయించడంపై ఎస్ఎఫ్ఐ నేతలు ధర్నా చేశారు. ఈ మేరకు గురువారం ఆ స్కూల్‌కు వెళ్లిన ఎంఈఓ చల్లా లక్ష్మణరావు అక్కడి పరిస్థితిని విద్యార్థుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. మూడో తరగతి విద్యార్థులకు రూ.8 వేలకు పుస్తకాలు, యూనిఫాం ఇస్తున్నారని నిర్ధారించుకున్న తర్వాత ఆ పుస్తకాలు, యూనిఫాం ఉన్న గదిని ఎంఈఓ సీజ్ చేశారు.

పౌష్టికాహారం అందజేయాలి

రేగిడి: మండలంలోని ఉంగరాడ, మజ్జిరాముడుపేట గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలను రాజాం ఏసీడీపీఓ శిమ్మాలమ్మ గురువారం సందర్శించి, ప్రీ స్కూల్ ఎలా నిర్వహిస్తున్నారు.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, పుణ్యవతి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

రేగిడి: మండలంలోని వండానపేట, అప్పాపురం, మజ్జిరాముడుపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సోహినీ రాఘవ్ తెలిపారు.

పాఠశాలలో ఎంఈఓల తనిఖీలు

తెర్లాం: మండలంలోని గంగన్నపాడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓలు జె.త్రినాథరావు, ఆర్.పాపారావు గురువారం తనిఖీలు నిర్వహించారు. పాఠశాలల పునఃప్రారంభం తర్వాత విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, జగనన్న గోరుముద్ద పథకం అమలు, జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీపై ఆరాతీశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని తెలిపారు.

గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయండి

తెర్లాం:మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామంలో నిర్మిస్తున్న ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ని గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. గురువారం ఆ గ్రామానికి వెళ్లిన ఆయన నిర్మాణ దశలోని ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని తెలిపారు.

విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని ఉనుకూరు రైతు భరోసా కేంద్రం వద్ద జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు చేతులమీదుగా రైతులకు గురువారం విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని సేవలు ఆర్‌బీకేల ద్వారా అందుతున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంటీయూ(1121), ఎంటీయూ(7029), బీపీటీ(5204) తదితర రకాల విత్తనాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.రాంబాబు, వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని హొంజరాం గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్వీ రమణారావు చేతులమీదుగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'వైఎస్సార్ పశుబీమా'

- పశుసంవర్ధక శాఖ ఏడీలు సత్యప్రకాష్, జయప్రకాష్



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏడీలు సత్యప్రకాష్, జయప్రకాష్



మెంటాడ: వైఎస్సార్ పశుబీమా పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వంగర: అర్హులైన పాడి రైతులందరికీ పశుబీమా పథకం వర్తింపజేస్తున్నట్లు సంతకవిటి, రాజాం పశు సంవర్ధక శాఖ ఏడీలు సీహెచ్ సత్యప్రకాష్, బొత్స జయప్రకాష్ తెలిపారు. స్థానిక పశువైద్య కేంద్రాన్ని గురువారం సందర్శించిన వారు అక్కడ అందజేస్తున్న వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలోని రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో వైఎస్సార్ పశుబీమా పథకం కింద 1900 యూనిట్లు లక్ష్యం కాగా, గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాల్లో వెటర్నరీ అసిస్టెంట్లు రిజిస్ట్రేషన్లు చేపడుతున్నారన్నారు. ఇప్పటివరకు 510 యూనిట్లు రిజిస్ట్రేషన్లు చేపట్టామన్నారు. పశువులకు రూ.30 వేల బీమా కల్పిస్తున్నామని, ఓ యూనిట్‌కు ప్రీమియం రూ. 1920 చెల్లించాల్సి ఉండగా రైతు రూ.384 చెల్లిస్తే సరిపోతుందని, రైతు తరపున ప్రభుత్వం రూ.1536 చెల్లిస్తుందన్నారు. గొర్రెలు, మేకలు, పందులకు రూ.6 వేలు బీమా వర్తిస్తుందని, బీమా ప్రీమియం రూ.180 చెల్లించాల్సి ఉండగా, రైతు రూ.36 చెల్లించాలని, మిగిలిన రూ.144 ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. గ్రామీణ పశుసంచార వైద్యసేవలు అన్ని గ్రామాలకు అందుబాటులో ఉన్నాయని, అత్యవసర సమయాల్లో పశువైద్య సిబ్బంది గ్రామాలకే వెళ్లి వైద్య సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. 75 శాతం రాయితీతో పశుగ్రాస విత్తనాలు, 70 శాతం రాయితీతో పశు దాణా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు వి.రాము, ఎం.అనీల్ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: వైఎస్సార్ పశుబీమా పథకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల పశువైద్యాధికారి వై.గోవింద అన్నారు. స్థానిక పశువైద్య కేంద్రంలో విలేకరులతో మాట్లాడిన ఆయన మండలంలో 450 ఆవులు, గేదెలకు బీమా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇంతవరకు 248 పాడిపశువులకు బీమా చేయడం జరిగిందన్నారు.

మెంటాడ: పాడిఆవులు, మేకలు, గొర్రెలు అకాల మరణం చెందితే వైఎస్సార్ పశుబీమా పథకం కింద ప్రభుత్వం బీమా సదుపాయం కల్పిస్తోందని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో పాడి రైతులతో సమావేశమైన ఆయన వైఎస్సార్ పశు బీమా పథకం, నట్టల నివారణ, టీకాలపై అవగాహన కల్పించారు. అనంతరం వైఎస్సార్ పశుబీమాకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు వై.వి.రమణ, ఎన్.చంద్రశేఖర్, సర్పంచ్ ఆర్.రాంబాబు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు



మాట్లాడుతున్న ఆర్‌డీఓ శేషశైలజ

రామభద్రపురం: గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతోందని, సమగ్ర భూసర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని ఆర్‌డీఓ పి.శేషశైలజ తెలిపారు. మండలంలోని సోంపురం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజారావు, సర్వే డీటీ ఉమామహేశ్వరితో సమావేశమై, భూముల రీసర్వే, సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లపై ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్థిర, చరాస్తులు, విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్లు అయినా ఇకనుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సినవసరం లేదని, ఇకనుంచి గ్రామ స్థాయిలోనే సచివాలయాల్లోనే ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేసుకునే సదుపాయం కల్పించిందన్నారు. దీంతో రిజిస్ట్రేషన్లకు డాక్యుమెంట్ రైటర్లు, దళారులు నిర్ణయించిన ధరలకు చెక్ పెట్టడం జరిగిందన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏయే సేవలు అందుతాయో సచివాలయాల్లో కూడా అవే సేవలు అందుతాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బొబ్బిలి: రెవెన్యూ డివిజన్ పరిధిలో భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ఆర్‌డీఓ పి.శేషశైలజ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. గజపతినగరం, దత్తిరాజేరు, బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం, మెంటాడ మండలాల్లోని 99 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని తెలిపారు.